# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గత దశాబ్ది కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ ఐదురెట్లు వృద్ధి చెందిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- ❖ వచ్చే నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి భారతీయ వ్యోమగామి వెళ్లనున్నారు.
- ❖ భారతీయ నాట్య శాస్త్రం, భగవద్గీతలకు యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో స్థానం లభించింది.
- ❖ టెక్నాలజీ, ఆవిష్కరణ రంగాల్లో సహకారం పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ టెస్లా సంస్థ సీఈఓ ఎలాన్ మస్క్ తో చర్చించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

==================

భారతీయ నాట్య శాస్త్రం, భగవద్గీతలకు యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో స్థానం లభించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ జ్ఞానం, గొప్ప సాంస్కృతులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. భగవద్గీత, నాట్య శాస్త్రాలు శతాబ్దాలుగా భారతీయ నాగరికత, చైతన్యాన్ని పెంపొందించాయని, ఇవి ప్రపంచానికి స్ఫూర్తిని ఇస్తూనే ఉన్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

==================

అంతర్జాతీయ అంతరిక్ష మిషన్‌లో భాగంగా వచ్చే నెలలో భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)కు వెళ్లనున్నారు. భారత వైమానిక దళానికి చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా రాబోయే ఆక్సియమ్ స్పేస్

మిషన్, Ax-4లో భాగం కానున్నారు. కేంద్ర అంతరిక్ష, అణుశక్తి శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ విషయాన్ని ప్రకటించారు. న్యూఢిల్లీలో ఈరోజు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) భవిష్యత్ ప్రణాళికలను సమీక్షించడానికి నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ మిషన్ ద్వారా భారతదేశం తన అంతరిక్ష ప్రయాణంలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించనుందన్నారు. దేశం మరొక అంతరిక్ష మైలురాయిని చేరుకోవడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. మానవ అంతరిక్ష ప్రయాణం, ప్రధానమైన ఇస్రో మిషన్ల ప్రాముఖ్యతలను జితేంద్ర సింగ్ వివరించారు.

==================

టెక్నాలజీ, ఆవిష్కరణ రంగాల్లో సహకారం పై ప్రధాని నరేంద్ర మోడీ ఈరోజు టెస్లా సంస్థ సీఈఓ ఎలాన్ మస్క్ తో ఫోనులో చర్చించారు. ఈ సంవత్సరం ప్రారంభంలో వాషింగ్టన్ డిసిలో జరిగిన సమావేశంలో మస్క్ తో చర్చించిన అంశాలతో సహా వివిధ అంశాలను ప్రస్తావించినట్లు సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి వెల్లడించారు. టెక్నాలజీ ఆవిష్కరణ రంగాలలో అమెరికాతో భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి భారతదేశ నిబద్ధతను నరేంద్రమోడీ పునరుద్ఘాటించారు.

==================

ప్రపంచంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ మన దేశంలో ఉండడం గర్వకారణమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈరోజు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామంలో సోలార్ పార్క్, గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్, విండ్ పవర్ ప్రాజెక్ట్ లను హెలికాప్టర్ ద్వారా మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ గ్రీన్ ఎనర్జీ సామర్థ్యానికి ఇది ఒక ఉదాహరణ అని కేంద్రమంత్రి అన్నారు.

==================

గుడ్ ఫ్రైడే సందర్భంగా యేసుక్రీస్తు త్యాగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్మరించుకున్నారు. ఈరోజు సామాజిక మాధ్యమ వేదిక ఆయన తన భావాలను పంచుకున్నారు. జీసస్ లోని దయ, కరుణ, ఎల్లప్పుడూ విశాల హృదయంతో ఉండడం మనకి స్ఫూర్తిని కలిగిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

==================

మే 1 నుంచి 4వ తేదీ వరకు ముంబై వేదికగా జరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమిట్ (WAVES) జరుగుతున్న ఏర్పాట్లపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాల నోడల్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జరిగే స్థలంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై కేంద్రమంత్రి సమీక్షించారు.

==================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

==================

గురు తేజ్ బహదూర్ జీవితం ధైర్యం, కరుణ, సేవకు ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 9వ సిక్కు గురువు గురుతేజ్ బహుదూర్ కు ప్రకాష్ పురబ్ ని పురస్కరించుకొని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు నివాళులు అర్పించారు. భూమిపై నడియాడిన ఆధ్యాత్మిక మార్గదర్శకులలో ఒకరిగా గురుతేజ్ బహదూర్ నిలుస్తారని పేర్కొన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారని, ఆయన బోధనలు సమాజాన్ని నిర్మించడంలో దేశానికి స్ఫూర్తిని ఇస్తూ ఉన్నాయని, భవిష్యత్‌లో కూడా ఇదే విధమైన స్ఫూర్తి అందిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు.

==================

గత దశాబ్ది కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ ఐదురెట్లు వృద్ధి చెందిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈరోజు గుర్గావ్ లోని మానేసర్ లో విలేకరులతో మాట్లాడుతూ.. మేక్ ఇన్ ఇండియా ఫలితంగా ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో భారీ ఎత్తున పురోగతి సాధించిందని చెప్పారు. గత 15 సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్ ఎగుమతులు 6 రెట్లు పెరిగాయని, ఇది 3 లక్షల 25 వేల కోట్ల రూపాయలను దాటిందని అన్నారు. నేడు ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో దాదాపు 25 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా ఎలక్ట్రానిక్ భాగాల తయారి పథకానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల ఆమోదించారని కేంద్రమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

==================

ఉపగ్రహ ఆధారితంగా టోల్ వ్యవస్థను మే ఒకటో తేదీ నుంచి ప్రారంభించడంపై ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, భారత జాతీయ రహదారుల అథారిటీ ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు అడ్డంకులు లేకుండా ప్రయాణించడానికి, ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి ఎంపిక చేసిన టోల్ ప్లాజాలలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైషన్ (ANPR) ఫాస్ట్ ట్రాక్ ఆధారిత టోలింగ్ సిస్టం అమలు చేస్తున్నామని మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఈ వ్యవస్థను అమలు చేయడానికి, ఎన్.హెచ్.ఏ.ఐ (NHAI) బిడ్లను ఆహ్వానించిందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

==================

చత్తీస్‌ఘడ్ లోని సుక్మా జిల్లాలో ఈరోజు సి.ఆర్.పి.ఎఫ్. సీనియర్ అధికారుల ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9 మంది మహిళ నక్సలైట్లు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు 40 లక్షల 50 వేల రూపాయలను రివార్డు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం కింద ఒక్కొక్కరికి 50 వేల రూపాయల ప్రోత్సాహక మొత్తాన్ని అందించారు. వీటితో పాటు వారికి ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు.

==================

బంగ్లాదేశ్ తమ దేశంలోని మైనార్టీల హక్కులను పరిరక్షించడంపై దృష్టి సారించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. పశ్చిమ బెంగాల్లో జరుగుతున్న పరిణామాలపై బంగ్లాదేశ్ అధికారులు చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బంగ్లాదేశ్ లో మైనారిటీలపై జరుగుతున్న వేధింపులపై

భారతదేశం ఆందోళన వ్యక్తం చేస్తోందని, ఇటువంటి చర్యలకు పాల్పడిన నేరస్తులు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్నారన్నారు. అనవసరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని, బంగ్లాదేశ్ లో మైనార్టీ హక్కులపై పరిరక్షణ దిశగా దృష్టి సారించాలని రణధీర్ జైశ్వాల్ సూచించారు.

==================

గుజరాత్, డయ్యూ, డామన్, దాద్రా నాగర్ హవేలీలలో ఏడు రోజుల పాటు తీవ్రమైన వేడి గాలులు ఉంటాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఈ ప్రాంతంలో తీవ్రమైన వేడి, ధూళితో కూడిన పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది. హిమాచల్ ప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలలో వర్షాలు కురుస్తాయని IMD అంచనా వేసింది. అలాగే ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఈరోజు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజులు నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని భువనేశ్వర్ వాతావరణ కేంద్రం తెలిపింది.

==================

==================